క్యాన్సర్ నివారణలో ఇమ్యూనో థెరపీ కీలకం

స్విమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం విజయవంతం

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న స్విమ్స్ సంచాలకులు

తిరుపతి టౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : స్విమ్స్‌లో అంకాలజి, ఇతర ప్రాంతాలలో సమర్ధవంతమైన నివారణ చికిత్స ఇంజనీరింగ్ రోగ నిరోధక కణాల పాత్ర అంశం పై శుక్రవారం స్విమ్స్ శ్రీ పద్మావతి ఆడిటోరియంలో అతిథి ఉపన్యాసం విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. విజయ్ గోపాల్ రెడ్డి, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్, శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఉషా కళావత్, పాథాలజి విభాగాధిపతి డా. రుక్మాంగద సంయుక్తంగా జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. విజయ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో క్యాన్సర్ నివారణలో ఇమ్యూనో థెరపీ కీలక పాత్ర పోషించనుంది. ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు విస్తృత స్థాయిలో సాగుతున్నాయి. ప్రస్తుతం కీమోథెరఫీ, రేడియోథెరపీ, సర్జరీ ఈ మూడు ప్రక్రియలు క్యాన్సర్ చికిత్సకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా ఇమ్యునోథెరపి అందుబాటులోకి రానుందన్నారు. క్యాన్సర్ సోకిన భాగంలో ఇంజనీర్డ్ అమ్యున్ సెల్స్ను ప్రవేశ పెట్టి క్యాన్సర్ కణాలను పూర్తిగా నిర్మూలించడంలో ఇమ్యునోథెరఫీ కీలక పాత్ర పోషిస్తుంది. క్యాన్సర్ నిర్మూలించే ప్రక్రియపై అధ్యయనం సాగుతుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల క్యాన్సర్లు, ఇతర వ్యాధులపై ఇంజనీర్డ్ ఇమ్యూన్ సెల్స్ పాత్ర అంశం పై ఒక్క రోజు వర్క్ షాప్ ఏర్పాటు చేసారు. రోగి శరీర భాగాలపై ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా క్యాన్సర్, ఇతర సంబంధిత వ్యాధులను నివారించడానికి దోహదపడే ఇమ్యూనోథెరపీ అందుబాటులోకి రావడంతో క్యాన్సర్ వ్యాధికి సంబంధించి వైద్య రంగంలో కొత్త తలుపులు తెరచినట్లైంది. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, డాక్టర్ విజయగోపాల్ రెడ్డికి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీధర్ బాబు, డాక్టర్ కళావత్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్. భార్గవి, డాక్టర్ మణిలాల్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శాంతి, డాక్టర్ సుచిత్ర, సర్జికల్, మెడికల్, అంకాలజి వైద్యులు, పాథలాజీ వైద్యులు, స్విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

సకలం శుభం 'గరుడ' వీక్షణం !

-భక్తజన సందోహం మధ్య ఏడుకొండలవాడు కటాక్షం

తిరుమల,సెప్టెంబర్ 22 ప్రభాతవార్తప్రతినిధి: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శుక్రవారం రాత్రి గరుడాద్రివాసుడు గరుడుని వాహనంగా చేసుకుని దివ్యమైన మంగళ రూపంలో భక్తులనుకటాక్షించాడు. రాత్రి 7గంటలకు వాహనమండపంవద్ద గరుడవాహనాన్ని అధిరోహింపజేసిన మలప్పకు అర్చకులు వేదఘోష్టితో కర్పూర హారతులిచ్చారు. చల్లటివాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య మెల్లగా మలయప్పస్వామి ముందుకు కదిలి భక్తకోటిని కరుణించడానికి ఆలయమాఢవీధుల్లో ఊరేగాడు.తెల్లవారుజాము 1గంట వరకు స్వామివారి గరుడసేవ వీక్షణకు భక్తులు వేయికళ్ళతో వేచిచూశారు. గరుడవాహనం ద్వారా స్వామివారు దాస భక్తికి ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బోర్డు సభ్యుడు యానాదయ్య, టిటిడి జెఇఒ సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఒ నరసింహకిశోర్ ,జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సరిగ్గా రాత్రి 7గంటలకు వాహన మండపం వద్ద పూజలందుకున్న మలయప్ప ప్రముఖులందరికీ శఠారి, కర్పూర హారతులు తరువాత మండపం దాటి రావడానికి దాదాపు 40నిమిషాలు సమయం తీసుకోవడం గమనార్హం.

గరుడ వాహన సేవలో టిటిడి చైర్మన్ భూమనతో మంత్రి రోజా తదితరులు

బంగారు పెద్ద శేషవాహనంపై... గణనాధుని దివ్యతేజసం

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధుడు బంగారు పెద్దశేషవాహనంపై అధిరోహించి కాణి పాకం గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం చిన్న శేషవాహనసేవను నిర్వహించగా రాత్రి స్వామివారికి బంగారు పెద్దశేషవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాదుల కమ్మ వ ంశస్థు లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు రాత్రి దేదీప్య మానంగా అలంకరించిన స్వామి అమ్మవార్లను అలంకారమండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వివిధరకాల పుష్పాలతో మిరమిట్లు గొలిపేరీతిలో అలంకరించిన బంగారు పెద్దశేషవాహనంపై వుంచి రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా గ్రామస్థులు, భక్తులు నారికేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, వేదపండితులు, ఉత్సవ

ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

చిన్నశేషవాహనంపై శివపుత్రుని వైభవం:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సర్వాలంకృ తుడైన స్వామివారు ఉభయదేవేరులతో కలసి చిన్నశేషవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు పంచామృతా భిషేకాలను నిర్వహించి శోభాయ మానంగా అలంకరించి ధూపధీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు వేద పండితుల మంత్రఘోష నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన

వైభవోపేతం...శ్రీకళ్యాణ వెంకన్న గరుడోత్సవం

-గరుడుపై కొలువుదీరి, భక్తులకు అభయమిచ్చిన కళ్యాణ వెంకన్న
-గరుడోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామివాకి గరుడోత్సవం

తిరుపతిరూరల్, సెప్టెంబర్22 ప్రభాతవార్త: శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టమైన గరుడోత్సవాన్ని అత్యంత వైభోపేతంగా... కనులవిందుగా... కమనీయంగా నిర్వహించారు. వేద పండితుల మంత్ర ఉచ్చరణలు, భక్తుల గోవింద నామా లు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజన లు, దేవతా మూర్తుల కళారూపాలతో తుమ్మలగుంట క్షేత్రం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించలేని భక్తులు తుమ్మలగుంటకు విచ్చేసి గరుడ సేవను తిలకించారు. పట్టువస్త్రాలు, స్వర్ణ ఆభరణాలు, విశేష పుష్పాల అలంకరణతో ముస్తా బైన కళ్యాణ వెంకన్న గరుడునిపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకు న్నాయి. అంతకమునుపు ఉదయం స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహిం చారు. ఉదయంశ్రీకళ్యాణ వెంకన్న మోహిని అవతారంలో పల్లకిపై ఊరేగుతూ భక్తుకు దర్శనమిచ్చారు.

-గరుడోత్సవంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి :
శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి గరుడ సేవలో జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు ఆలయం వద్దకు చెరుకుని సారె సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వీరికి స్వాగత, దర్శన ఏర్పాట్లు చేసారు.

మోహిని అవతారంలో నిత్య కళ్యాణ శోభితుడు:
శ్రీ కళ్యాణ వెంకన్న శుక్రవారం ఉదయం మోహిని అవతారంలో దర్శన మిచ్చారు. ఈ వాహనంకు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే మోహిని అవతారంలో స్వామి భక్తులను ఆకట్టుకునేలా వివిధ రకాల అభరణాలు ధరించి... కుడి చేతిలో చిలుకను పట్టుకుని... ముందు ఏర్పాటు చేసిన అద్దంలో ముఖాన్ని చూస్తూ ఉంటారు. స్వామి పల్లకి సేవలో భక్తులు తరించి పునీతులయ్యారు.

బ్రహ్మోత్సవాలలో నేడు:
శ్రీకళ్యాణ వేంకన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనంపై, సాయంత్రం 7గంటలకు గజ వాహనంపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

జగనన్న హౌసింగ్‌లో ఇసుక కూపన్ల జారీలో...

రూ.లక్షల అక్రమాలు!

-పిడికి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ఫిర్యాదుతో బయట పడ్డ సమాచారం -లబ్దిదారులకు తెలియకుండానే సిస్టంట్ నుంచి విడుదల -శ్రీకాళహస్తి కేంద్రంగా ఇసుక కూపన్లను అక్రమాలు

నారాయణవనం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణంలో భారీగా అవినీతి జరగడాన్ని హౌసింగ్‌శాఖలో పని చేస్తున్న కొంతమంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆలస్యంగా గుర్తించారు. హౌసింగ్ నిర్మాణంలో లబ్దిదారులకు అందించే ఇసుక కూపన్లను తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీ, సూళ్లూరుపేట కేంద్రంగా కొంతమంది వ్యక్తులు ఇసుక కూపన్లను లబ్దిదారులకు తెలియకుండా కూపన్లను కంప్యూటర్ నుంచి బయటకు తీసి అమ్ముకుంటున్న వైనాన్ని గుర్తించారు. హౌసింగ్ కట్టుకొనే లబ్దిదారులకు ప్రభుత్వం 4 ఇసుక కూపన్లను దశల వారిగా అందించడం జరుగుతుంది. ఇందులో బేస్‌మేట్ లెవల్, ఏడు అడుగులు, మొల్డింగ్, పూత పని కోసం అంటూ 4 బిల్లులను ఇంజనీరింగ్ అధికారులు ఇస్తారు. దీని కోసం ఒక్కో బిల్లుకు ప్రభుత్వం 875 రూపా యాలను లబ్దిదారుల బిల్లు నుంచి కట్ చేసుకుంటుంది. అయితే గత మూడు నెలలుగా సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చా టూరు, నారాయణవనం, కెవిబిపురం, వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ, సూళ్లూరుపేట, తడ, వెంకటగిరి, శ్రీకాళహస్తీ, ఏర్పేడు, చిత్తూరు జిల్లా నగరిలో కొంతమంది హౌసింగ్‌లో పనిచేస్తున్న ఇంజ నీరింగ్ అసిస్టెంట్లను ట్రాక్టర్ యజమానులు, బ్రోకర్లు వలలో వేసుకొని వారి నుంచి 1000,1200 రూపాయాలకు దొంగచాటుగా ఇసుక కూపన్లను తీసుకొని కావాల్సిన వ్యక్తులకు అధిక ధరలు పెట్టి అమ్ముకుంటున్నారు. ఈ బిల్లులు ఎక్కువగా నాగలాపురం, పిచ్చాటూరు, కెవిబిపురం, శ్రీకాళహస్తీ, సూళ్లూరుపేట, నగరి నుంచే ఈ బిల్లులు రావడంతో నాగలాపురంలోని నందనం, సుబ్బానాయుడు కండ్రిగ రీచ్ నుంచి ఇసుకను తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. అయితే ఈనెల 18న శ్రీకాళహస్తీ కేంద్రంగా రాత్రి 8గంటల నుంచి ఉదయం వరకు ఇసుక కూపన్ల కంప్యూటర్ నుంచి బయటకు తీసిన విషయాన్ని ఇంనీరింగ్ అసిస్టెంట్లు గుర్తించారు. ఇలా జిల్లాలోని అన్ని మండలాల నుంచి 50 నుంచి 100 కూపన్లను బయటకు తీయడంతో లబ్దిదారులకు కూపన్లు తీయాలని సిస్టమ్‌లోకి వెళితే ఇదే వరకే కూపన్లను తీసేయడం జరిగిందని కంప్యూటర్‌లో చూపించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కంగుతిని సమాచారాన్ని జిల్లా ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో విచారణను గోప్యంగా కొనసాగిస్తున్నారు. కూపన్లను బయటకు తీసినప్పుడు.. దాంతో పాటు హోలో గ్రామ్ కూడా తప్పక అవసరం ఇది ఎలా తీసారో గుర్తించి, అక్రమాలకు పాల్పడిన వ్యక్తితో పాటు ప్రోత్సహించిన వారిని, కొనుగోళు చేసిన వారిని గుర్తించే పనిలో జిల్లా హసింగ్ అధికారులు నిమగ్నమయ్యారు.

నారాయణవనం మండలంలోని జగనన్న కాలనీ (ఫైల్ ఫోటో)

జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వివరణ :
శ్రీకాళహస్తీ, సత్యవేడు, సూళ్లురుపేట, వెంకటగిరి, చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలోని నగరి నుంచి జగనన్న హౌసింగ్ కూపన్లను కొంతమంది వ్యక్తులు బయటకు తీసిన వైనాన్ని గుర్తించిన విష యం నిజమని, హౌసింగ్ పిడి వెంకటేశ్వర్లు ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. కూపన్ల జారీలో భారీగానే అక్రమాలు జరిగిందని, దీనికి కారకులైన వారిని గుర్తించే పనిలో వున్నామన్నారు. లక్షల రూపాయాలను దోచుకొని లబ్దిదారులకు అన్యాయం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకొని లబ్దిదారులకు న్యాయం చేస్తామన్నారు. అక్రమార్కులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేనాడు దీవిలో ఘనంగా...

మొదలైన గంధోత్సవం

- భారీగా తరలివస్తున్న భక్తులు - సూళ్లూరుపేట నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు
- పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు

తడ, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వేనాడు దీవిలో 28వ గంధ మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య మొదలైంది. శుక్రవారం ఉదయం నుంచి పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న వేనాడు దీవికి జనం పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున్ రాత్రి నుంచే తాము బస్సులు నడుపుతున్నామని తెలిపారు. శుక్రవారం ఏకంగా 12 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. సూళ్లూరుపేట పట్టణం నుంచి షార్ రోడ్డులో అటకానితిప్ప వరకు వెళ్లి అక్కడి నుంచి పులికాట్ సరస్సులో వేసిన గ్రావెల్ రోడ్డుపై 10 కిలోమీటర్ల దూరం వేనాడు దీవికి ప్రయాణించాల్సి ఉంది. గ్రామానికి కొంచెం దూరంలో చక్కటి వాతావరణం మధ్య హజరత్ షేక్ దావూద్‌షావలిల్లాహ్ దర్గా ఉంది. శుక్రవారం ఈ దర్గాలోని అతి పొడవైన సమాధిని భక్తులు దర్శించుకుంటున్నారు. వేనాడు బాబాగా, అల్లాతాతగా దశాబ్దాలుగా పూజలందుకుంటున్న ఈ దర్గాకు ప్రతి ఏటా జరిగే గంధ మహోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి భక్తులు హాజరవుతారు. ఈ సారి కూడా ఖరీదైన కార్లు వేనాడు మార్గం పట్టాయి. అక్కడ నాయుడుపేట సబ్ డివిజన్ పరిధి నుంచి పెద్దసంఖ్యలో పోలీసులను బందోబస్తుకు నియమించారు. నాయుడుపేట డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేట రూరల్ సిఐ వైవీ సోమయ్య, తడ ఎస్ఐ జెపి శ్రీనివాసురెడ్డి తదితరులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వేనాడు దీవిలో దర్గా చుట్టూ విద్యుద్దీపాలంకరణలు, రంగుల రాట్నాలు వంటివి ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచే దర్గా వద్ద భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు స్థానికంగా ఉన్న వారు, బయటి ప్రాంతాల దాతలు కూడా వేనాడును చేరుకొని దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అన్నదానం వంటివి ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గా నిర్వాహకులు కూడా కొంత మంది భక్తులకు భోజనాన్ని అక్కడే సిద్ధం చేస్తున్నారు. ఉదయం నుంచి ఈ ప్రాంతంలో మబ్బులు, ఈదురు గాలులు ఉండటంతో వర్షం భయం తప్పలేదు. అయితే సాయంత్రానికి వాతావరణం చల్లబడి గంధోత్సవ నిర్వహణకు ఎటువంటి అడ్డంకులు లేకుండా పోయాయి. అర్ధరాత్రి నుంచి వేనాడు ప్రధాన గ్రామం ద్వారా గంధాన్ని భక్తిశ్రద్ధలతో కోలాహలంగా నృత్యాలతో ఊరేగించి దర్గా వద్దకు తీసుకొచ్చి సమాధిపై చల్లుతారు. ఈ సందర్భంగా తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తెలుగుమహిళల ఆధ్వర్యంలో రిలేనిరాహారదీక్ష

-హజరైన మాజీ ఎంపి పనబాకలక్ష్మి

తెలుగు మహిళల దీక్ష

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు అక్రమ అరెస్టుకు నిరసనగా శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం ముందు తెలుగు మహిళలు దీక్ష చేపట్టారు. కార్యక్రమా నికి మాజీ ఎంపి, తిరుపతి టిడిపి పార్లమెంటు ఇన్‌ఛార్జి పనబాకలక్ష్మి, టిడిపి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్‌లు విచ్చేసి తమ సంఘీ భావాన్ని తెలిపారు. శ్రీకాళహస్తి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి మహిళల చెప్పినరిలే నిరాహార దీక్షకు సంఘీభావ ప్రకటించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెటు మహిళా అద్యక్షురాలు ఉష, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ మహిళ అధ్యక్షురాలు సుమతి, సుభాషిణి, కుమారి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి బి.రేణుకాదేవి, మల్లీశ్వరి, అనిత, సుభాషిణి, ఇందిరపవార్, చంద్రకళ, సుజాత, అనూష, అమరావతి, రత్నమ్మ, మరియు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి చెంచయ్యనాయుడు, మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, ఎస్సీ వీదిలీప్, ప్రతాప్‌రెడ్డి, ఉమేష్‌రావు, శ్రీనివాసులురెడ్డి, గోపినాథ్, కాసరం రమేష్, సుజిత్, వినయ్, ప్రతాప్ మరియు రాష్ట్ర పార్లమెంటు పట్టణ, మండల, గ్రామ, వార్డు మహిళలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జెసి

గుడిపాల, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారు లను ఆదేశించారు. గుడిపాల ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగన్నకు చెబుదాం కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి సమస్యలను సత్వరం పరిష్కరిం చడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి క్షేత్ర స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి జిల్లా అధికార యంత్రాంగం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంను మరింత విస్తృతం చేయడానికి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో నిర్వహించి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించడానికి జిల్లా స్థాయి అధికారులు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగాభవానీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, పిఆర్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, డిఎల్‌డిఓ రవికుమార్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవికుమార్, మండల ప్రత్యేక అధికారి మదుసూధన్‌రెడ్డి, ఎంపిడిఓ రాజశేఖర్, డిప్యుటీ తహసిల్దారు కళ్యాణి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వామీ మాట తీరుమార్చుకో... టీడీపీ నాయకుల హితువు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట తీరుమార్చుకోవాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి, మండల ఆ పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి సంయుక్తంగా హెచ్చరించారు. బాబుతో నేను10వ రోజు రిలేనిరాహారదీక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టారని ప్రభుత్వ దాష్టీకానికి సంఘటన పరాకాష్ట అని విమర్శించారు. ఈ జరిగిన అసెంబ్లీలో స్వామీ టీడీపీ ఎమ్మెల్యేలను చులకనగా మాట్లాడిన తీరు దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంగల్రాయుల రెడ్డి, దామోదర్ రెడ్డి, మునికృష్ణా రెడ్డి, మునిరాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ఓం శక్తి పూజలు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు క్షేమం కోరుతూ శుక్రవారం కీరమంద గ్రామంలో ఓం శక్తి ఆలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం శక్తి అమ్మవారికి అభిషేక పూజలు, అనంతరం చంద్రబాబునాయుడు క్షేమం కోరుతూ 101 టెంకాయలను కొట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించిందని రాష్ట్ర బిసీ సాధికారిత కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాసులునాయుడు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీదేవిబాబు, టిడిపి నాయకులు విజయేంద్రకుమార్‌కు సుబ్రమణ్యం, హరికృష్ణారెడ్డి, అన్బు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విమజ్జనం

పాలసముద్రం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: మండలంలోని శ్రీకావేరిరాజపురం గ్రామంలో శుక్రవారం వినాయకుడి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. గ్రామ పుర వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంను ట్రాక్టర్‌పై వుంచి భారీ ఊరేగింపుతో పూజలు నిర్వహిస్తూ గ్రామంకు వెలుపల వున్న కొత్త చెరువుకు తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు విచిత్ర వేషాధారణలు వేసుకొని కేరింతలు కొడ్తూ నృత్యాలు చేస్తూ వినాయక విగ్రహంను కొత్త చెరువుకు తీసుకెళ్ళి నీటిలో కలిపారు.

పొలిటికల్ బ్రోకర్ ఉండవల్లి అరుణ్‌కుమార్

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ ఒక కుహానా మేధావి, పొలిటికల్ బ్రోకర్ అని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై బురద చల్లడానికే అరుణ్‌కుమార్ హైకోర్టులో కేసును సిబిఐకు అప్పగించాలని పిల్ దాఖలు చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం అధికార ప్రతినిధి అమనాథ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఉపాధి కూలీలకు పనులు

పాలసముద్రం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పక్కాగా పనులు కల్పించాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంగళరాజు కుప్పంలో శుక్రవారం రోజ్‌గారి దివస్ కార్యక్రమంలో భాగంగా ఎపిఓ మార్గరేట్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెరువుల్లో పూడిక తీత, ఇళ్ళ ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు, రహదారికి ఇరువైపుల మొక్కలు పెంపకం వంటి పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు.

'దేశం' ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడును సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలుగుదేశం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. కొంగారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన నిరసన దీక్షా శిబిరంలో తెలుగుదేశం ఎస్సీ సెల్ నాయకులు పాల్గొని తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తప్పుడు కేసులతో అరెస్టు చేసి జైలుకు పంపిన తన పార్టీ అధినేతను సత్వరం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

వైకాపా ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదు

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్ మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు పదమూడవ రోజుకు చేరాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించే చంద్రబాబును కుట్రతోనే జైలుకు పంపార న్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, కౌన్సిలర్లు సెల్వరాజ్, జాకీర్, రవి, వేణు, నేతలు కన్నన్,ఆర్ఆర్ రవి, ప్రతాప్‌సింహా, రవినాయక్, సుధ, పిఎస్ సతీష్, వినయ్, నరేష్, రాజేష్, నాగభూషణం, సతీష్, జయరాం, తిరుమగళ్, విష్ణు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

31న కుప్పం టౌన్‌బ్యాంక్ మహాజన సభ

కుప్పంరూరల్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : కుప్పంలోని సహకార టౌన్‌బ్యాంక్ మహాజన సభ ఈనెల 31వతేది నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ డాక్టర్ భాగ్యరాజ్ ప్రభంజన్ తెలిపారు. ఈసందర్భంగా ఎక్లాస్ సభ్యుల అడ్మిషన్లు ఆమోదం, వివిధ ప్రతిపాదనలపై చర్చించడం జరుగుతుందన్నారు. సభకు ఎ క్లాస్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.డైరెక్టర్లు మహేంద్ర, సంజీవికుమార్, మేనేజర్ శివకృష్ణ పాల్గొన్నారు.

25లోగా పంట నమోదు.. ఇకెవైసి చేయించుకోవాలి

శాంతిపురం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : మండలంలో సుమారు ఐదువేల ఎకరాల్లో సాగవుతున్న పంటల వివరాలను రైతులు ఇ- పంటలో ఈనెల 25లోగా నమోదు చేసుకోవాలని ఎఒ అప్పోజి తెలిపారు. వ్యవసాయ, ఉద్యా నవన, పట్టు పంటలను నమోదు చేసుకున్న అనంతరం ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఇ-పంట వైఎస్సార్ రైతు భరోసా,పిఎం కిసాన్, పంట భీమాలకు అనుసంధానం చేయడం జరిగిందని రైతులు ఎక్కడ ఉన్నా పంట నమోదును తప్పక చేయించుకోవాలని కోరారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు... గ్రామస్తుల ఆవేదన

కుప్పంరూరల్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

తేలికపాటి వర్షం పడితే చాలు రోడ్డుపై నీరు నిల్వ ఉండి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నూలుకుంట గ్రామంలో ఈపరిస్థితి నెలకొంది. శుక్రవారం కొంత వర్షం కురిసిన నేపథ్యంలో నీరంతా రోడ్డుపై నిల్వ చేరింది. మరికొందరి ఇళ్లలో చేరడంతో పలువురు గ్రామస్తులు వాపోయారు.అధికారులుస్పందించి వర్షపునీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌లు మార్పు చేయాలని కలెక్టర్‌కు వినతి

వెదురుకుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : మండలంలో కొన్ని గ్రామాల్లో ఏమ్మెల్యే ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి న్నట్లు టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళి తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెదురుకుప్పం నాయకులు పాల్గొని వినతి పత్రం అందజేసిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సంతబయలు,గొడుగుచింత, ఇనాంకోత్తూరు పంచాయితీలలో అసెంబ్లీ ఎన్నికలకు బూత్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు సౌక ర్యం కల్పించాలని కోరిన్నట్లు చెప్పారు. కలెక్టర్ స్పందించి అక్కడ బూత్‌లు ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారని మోహన్ మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం డిప్యూటీ తహశీల్దార్ కోమలి, నియోజకవర్గం నాయకులు చిట్టిబాబు నాయుడు, రుద్రయ్య నాయుడు, గుండయ్య, రమేష్, గురప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చవటగుంటలో ఘనంగా కుంకుమార్చన

వెదురుకుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : చవటగుంట యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘనంగా కుంకుమార్చన కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గణపయ్య విగ్రహం వద్ద పురోహితులు గౌరీశంకర్ వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఉంటుందని అందులో భాగంగా ఉట్టీ కొట్టడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు, పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

కోడి వ్యర్థాలను తరలించే లారీ బోల్తా

చౌడేపల్లి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : కోడి వ్యర్థాలను తరలించే లారీ బోల్తా పడి ఎలాంటి ప్రాణనష్టం వాటిళ్ళని సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో తిరుపతి వైపు వెళుతున్న లారీ కడియాలకుంట సమీపంలో అదుపుతుప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం లో లారీలో వున్న ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం సంభవించక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. కర్ణాటకరాష్ట్రం కోలారు నుంచి నెల్లూరుకు కోళ్ళ వ్యర్థాలు తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది.

విగ్రహ ఏర్పాటుకు అధికారుల పనితీరు భేష్

చౌడేపల్లి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

పట్టణానికి సమీపంలోని బోయకొండ మార్గంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో మండలస్థాయి అధికారులు పనితీరును పలువురు ప్రశంసించారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ, చౌకదుకాణం డీలర్ల ఆధ్వర్యంలో పలువురు అధికారులకు ఘన సన్మానం లభించింది. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం వైకాపా పరిశీలకుడు పెద్దిరెడ్డి ఆదేశాను సారం చౌడేపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తహశీల్దార్ మాధవరాజు స్థలాన్ని కేటాయించారని కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎపి సాంఘీకసంక్షేమశాఖ డిడి లక్ష్మీ విగ్రహ ఏర్పాటుకు రూ. 13లక్షలను మంజూరు చేస్తూ అనుమతుల కోసం రాష్ట్ర కమీషనర్‌కు నివేదికలు పంపారన్నారు. ఈ స్థాయి వరకు తీసుకొచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారందరినీ సన్మానించారు. ఎంపిడిఓ సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు నరసింహులుయాదవ్, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, వైకాపా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరదా గోవిందయ్య, డీలర్ల సంఘ అధ్యక్షుడు లాజర్ అనే సుధాకర్, రాధ, కూరపర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ వద్దు ఓపిఎస్ ముద్దు : ఫ్యాప్టో

చౌడేపల్లి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : జిపిఎస్ వద్దు ఓపిఎస్ కావాలని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యా యుడు నాగరాజరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిపిఎస్ విధానాన్ని నిరసిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసారు. ఎన్నికల సమయంలో సిపిఎస్‌ను రద్దు పరస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట ఇచ్చారనీ, అధికారం వచ్చాక అమలు పరచలేదన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన మాట నిలుపుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరవనం అభివృద్ధికి చర్యలు

– జిల్లా అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి

కుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త : కుప్పం మండలం నడిమూరు సమీపంలో అటవీశాఖ అధ్వర్యంలో నగరవనం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో నగరవనం ఏర్పాటుచేయాల్సి ఉండగా సరైన స్థలాలు లేకపోవడంతో కుప్పంకు సమీపంలో ఉన్న నడిమూరు అటవీ ప్రాంతంలో నగరవనం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు డిఎఫ్ఒ తెలిపారు. ప్రజలు, పర్యాటకులను ఆకర్షించేలా నగరవనంను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో వై.చంద్రశేఖర్‌రెడ్డి, డిఆర్వో కృష్ణప్రసాద్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎకో ఫ్రెండ్లీ మహారుద్ర గణపతి

కుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

వినాయక చవితి సందర్భంగా కుప్పం ప్యాలస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన ఎకో ఫ్రెండ్లీ మహారుద్ర గణపతి విగ్రహం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. పూర్తి మట్టితో ఈ విగ్రహంను ఏర్పాటుచేశారు. విగ్రహం ముందర పరమశివుడి విగ్రహం ఏర్పాటుచేశారు. వివిధ రంగులతో కూడిన విద్యుద్దీపాలంకరణ చేయడంతో ఈ మహారుద్ర గణపతి మండపం ప్రజలను ఆకట్టుకుంటోంది. శ్రీమంజునాథ వినాయక సేవా సంఘం అధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

వేడుకగా వినాయకుని ఊరేగింపు

కోట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన కోట దళితవాడలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం రాత్రి వైభవంగా ఊరేగిం చారు. పురవీధుల్లో భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. డప్పులు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు కన్నుల విందుగా సాగింది. దళితవాడ, మహాలక్ష్మమ్మ వీధి, బజారుసెంటర్, ఆర్టీసీ బస్టాండు మీదుగా ఊరేగింపు సాగింది. అనంతరం వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్రంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

కోటమ్మ ఆలయంలో అన్నదానం

కోట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

కోటలోని కోటమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోటలో చెత్త తొలగించండి బాబూ..!

కోట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన కోట పంచాయతీలోని పలు కాలనీల వద్ద చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ ఎదురుగా ఖాళీ స్థలంలో ఆ ప్రాంత ప్రజలు చెత్త వేయడంతో పందులు ఆ చెత్తలో పొర్లాడుతుండటం వల్ల దుర్గంధంగా మారింది. దీంతో ఎక్కడ డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు సోకుతాయో అని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వివిధ ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, తడ మండలం పెదమాంబట్టు గ్రామానికి చెందిన కటారి చిన్నయ్య తన కుమార్తె గ్రామమైన ఏకొల్లుకు వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో సూళ్లూరుపేట నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న మోటార్‌బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నయ్యను స్థానిక పోలీ సులు చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు

నాయుడుపేట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

నాయుడుపేట పట్టణంలో వినాయక చవితి సందర్భంగా పూజలందుకున్న పలు గణనాథుల విగ్రహాలకు శుక్రవారం ఘనంగా ఊరేగింపులు చేసి నిమజ్జనాలకు తరలించారు. గణనాథులను మండపాల నుంచి ట్రాక్టర్లలో ఊరేగింపుగా తరలించారు. మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో గణేష్ ప్రవచనాలలో ఆనందంగా పాల్గొన్నారు. ఐదురోజుల పాటు విశేష సేవలు అందుకున్న వినాయకుడిని రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా సముద్రంలో నిమజ్జనం చేయడానికి సాగనంపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

నాయుడుపేట మండలం నరసారెడ్డికండ్రిగ గ్రామ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిపై బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వేముగుంటపాలెం గ్రామంలో కూలీ పనులకు వెళుతున్న శ్రీవాణి, రంగారావు అనే ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిద్దరిని 108 అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వామ్యం జగన్ పాదాల కింద నలిగిపోయింది

–మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

అనుమతులు లేకుండా వైకాపా నాయకులు అన్ని గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా గ్రావెల్ తరలిస్తుంటే పట్టించుకోక పోలీసులు, సొంత పొలంలో నుంచి ఇళ్లకు గ్రావెల్ తరలిస్తుంటే పట్టించుకోని పోలీసులు. సొంత పొలంలో నుంచి ఇళ్లకు గ్రావెల్ తరలిస్తున్న రైతులు, తేదేపా కార్యకర్తలపై దాడులు చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వైకాపా ప్రభుత్వంపై పోలీసులపై మండిపడ్డారు. ఎస్సీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న వెంకటాచలం, సిఐ అంకమ్మరావును వెంటనే డిస్మిస్ చేయాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం కనుపూరు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య అనే దళితుడిపై వెంకటాచలం సిఐ అంకమరావు దురుసుగా ప్రవర్తించి దాడి చేయడం దారుణమని అన్నారు. కుటుంబ వ్యక్తిగత విషయాల్లో సిఐ జోక్యం చేసుకుని అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరమణయ్యను తీవ్రంగా కొట్టి గాయపరిచాడని, సిఐ అంకమరావు వైసిపి నాయకులు కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. దళితులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని దళిత సంఘాలను ఐక్యం చేసుకుని పోలీసు స్టేషన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పి విచారించి బాధితుడు వెంకటరమణయ్యకు న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యుడైన సిఐ అంకమరావును వెంటనే విధుల నుండి తొలగించాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ప్యానల్ స్పీకర్‌గా ప్రసన్న నియామకం పట్ల హర్షం

కోట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని రాష్ట్ర అసెంబ్లీ ప్యానల్ స్పీకర్‌గా నియమించడం పట్ల తిరుపతి జిల్లా వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కోవూరు నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఓ సారి మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ప్రసన్నకుమార్‌రెడ్డిని అసెంబ్లీ ప్యానల్ స్పీకర్‌గా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జరగబోయే ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఏడోసారి కూడా ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

పార్లు దండాలు చేస్తూ డెయిరీ కార్మికులు నిరసన

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

మూతపడిన చిత్తూరు విజయ డెయిరీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పొర్లు దండాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు విజయ డెయిరీని ప్రభుత్వం మూసివేసి ప్రస్తుతం ఆమూల్ సంస్థకు లీజు ఇచ్చి పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మూత పడిన సందర్భంలో డెయిరీలో విధులు నిర్వర్తించిన కార్మికులు తమకు రావాల్సిన బకాయిల చెల్లింపు కోసం గత వారం రోజులుగా డెయిరీ ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ క్రమంలో తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సత్వరం చెల్లించాలని నిరసన కార్యక్రమంలో కార్మికులు డిమాండ్ చేశారు.

వరదునికి వైభవంగా గరుడసేవ

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గరుడసేవను అత్యంత వైశవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమలలో గరుడసేవ జరిగే సమయంలో శ్రీవరదరాజస్వామి ఆలయంలో స్వామివారికి గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో పగలు స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు వేపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకఅభిషేకాలు నిర్వహించి,అలంకరించి పూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమరి ప్చారు.అలాగే ఆలయ మండపంలో హోమాలను నిర్వహించారు. తిరిగి రాత్రి స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం తన కిష్టమైన అలంకరించిన గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వ

హిందూ శ్మశాన వాటికను పరిశీలించిన చైర్మెన్

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదిలో రూ.27కోట్ల ప్రాథమిక అంచనాలతో దక్షిణకైలాసం ధామం పేరుతో శాసన సభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రతిష్టాత్మకంగా హిందూ శ్మశాన వాటికను ఏర్పాటు చేస్తున్నారని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మున్సిపల్,దేవస్థానం ఇంజనీర్లతో కలసి శుక్రవారం కలసి పరిశీలించారు. ఈ పుణ్యకార్యక్రమాలకు శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి వ్యక్తిగతంగా రూ.కోటి విరాళం ప్రకటించారన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున ఆధ్యాత్మిక పద్ధతిలో నిర్మిస్తున్న స్వర్గధామం తొలదశలో రూ.2.5కోట్లు మున్సిపల్ నిధులతో పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం గ్యాస్ బర్నింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు దేవస్థానం డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఇ రాజేశ్వరి,సుదర్శనం రెడ్డి, కామేశ్వరరావు, మున్సిపల్ డిఇఇ లలిత,యుగంధర్,చెంచయ్య, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్, కాంట్రాక్టర్ హరి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

తొట్టంబేడు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో వెలసిన ఉన్న వీరభద్రస్వామికి శుక్రవారం తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేషాలంకరణ చేపట్టి స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు త్వరగా విడుదల కావాలని వారి కుటుంబసభ్యులపేరుతో అర్చనచేసి ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని స్వామివారిని కోరుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ పోతుగుంటరాజేష్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చింతపట్ల భాస్కర్‌నాయుడు, సీనియర్ నాయకులు పెద్దాసరి మంగారెడ్డి, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మాజీ ఎంపిటిసి విజయకుమార్, మాజీ సర్పంచ్ చలపతి, ఎస్సీ సెల్ నాయకులు సునీల్‌కుమార్, గౌరీశంకర్, పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్నురాఘవులు యాదవ్, ఐటీడిపి మండల అధ్యక్షుడు కాసరం బాలాజీ, వివేకనాయుడు, శ్రీను, బిసి సెల్ నాయకులు గుర్రప్ప, కమలనాథ్, సుబ్రమణ్యం, ప్రభాకర్, గోపి, శివ, లావణ్య, కుమార్, మురళీధర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, శారదమ్మ, ముని తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు 108కొబ్బరికాయలతో మొక్కులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

పట్టణంలోని బహదూరుపేటలో వెలసి ఉన్న నల్లగంగమ్మగుడి ఆవరణ వద్ద ఆలయ చైర్మన్ కంఠా రమేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని ఆయన కడిగిన ముత్యంలా బయటకు రావాలని ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి పూజలు నిర్వహించి 108కొబ్బరికాలు కొట్టి మొక్కులుతీర్చుకున్నారు. ఈసందర్భంగా కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, గురవారెడ్డి మండల అధ్యక్షులు కామేష్‌యాదవ్, చెంచయ్యనాయుడు, రమేష్, ప్రసాదరావు, అనిల్, రాము, గోపినాథ్, దిల్లీబాబు, యాదగిరి, రేణుకమ్మ, మల్లీశ్వరి, ఖాదర్‌బాషా, డివినారాయణ, గుర్రప్పశెట్టి, అస్మత్, దొరబాబు, ఆర్ముగం, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, ఆర్ముగం, పోతుగుంట రాజేష్, గోగినేని సురేష్, ప్రతాప్, మురళీ, పోలూరుశ్రీనివాసులురెడ్డి, రాఘవులు, మిన్నల్‌రవి, కుమార్, గోవిందు, నర్సింహులు, వెంకటేశ్వర్లు, మునిరాజ, సుబ్బయ్య, శేషనాయుడు, శంకర్, భాస్కరయ్య, పాండు, రామమూర్తి, సుబ్రమణ్యం, తెలుగుదేశంపార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల ఆందోళన

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సిపిఎస్ ఉపాధ్యాయులు శుక్రవారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు వి గంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మాకు ఎటువంటి పరిస్థితిలో ఈ మాయదారి జిపిఎస్ వద్దు, ఓపియస్ కావాలని నినాదాలు చేసారు. భోజన విరామ సమయంలో వారి ఆందోళన చేపట్టి నినదించారు. రాష్ట్రంలోని జిపిఎస్ మాకొద్దని ఎంత లబొదిబో అంటున్నా ప్రభుత్వం ముందుకు వెళుతుందని దుయ్యబట్టారు.ఇప్పటికైనా జిపిఎస్‌కు స్వస్తి చెప్పి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాని కోరారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి పివి సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు వెంకట్రాది గోపి, పావని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలంలో పోషణ అభియాన్ కార్యక్రమాలు

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఐసిడియస్ ప్రాజెక్టు సారధ్యంలో 'పోషణ అభియాన్' కార్యక్రమాలను సిడిపిఓ శాంతిదుర్గ సారధ్యంలో నిర్వహించారు.మండలంలోని ఎంపేడు సెక్టార్, కలవగుంట సచివాలయ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల్లో కలవగుంట, గుండ్ల పల్లి,కెపి చింతల,ఎంపేడు,యార్లపూడి, ఈశ్వరయ్యకాలని సూరావారి పల్లి అంగన్‌వాడి కేంద్రాల్లో సమిష్టిగా పోషణ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. పోషక ఆహార లోపం వల్ల కలిగే దుష్ప్రభావాలు,జాగ్రత్తలపై సూచనలిచ్చారు.గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు.ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ మంజులవాణి, మన్నవరం అంగన్‌వాడీ టీచర్ వి.గాయత్రి, ఎంపేడు టీచర్ పి.సౌజన్య, కలవగుంట అంగన్‌వాడీ టీచర్ సి.పుష్ప, యార్లపూడి టి.సక్కుబాయి, ఈశ్వరయ్యకాలనీ అంగన్‌వాడీ టీచర్ జి.మంజులవాణి,సూరావారిపల్లి అంగన్‌వాడీ టీచర్ పల్లిమనెమ్మ, గుండ్లపల్లి సౌజన్య, కెపి చింతల వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్చిని ఢీకొన్న వాహనం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి పానగల్‌లోని శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్మించిన ఆర్చిని ఓ భారీ వాహనం ఢీకొనటంతో పాక్షికంగా ఆర్చి దెబ్బతిన్నది.పానగల్‌లోనిర్మించిన ఆర్చి నుంచి ఊరందూరు మార్గంలో వాహనాలు మలుపు తిరగాలి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుంది. ఈ ప్రమాదాన్ని దేవస్థానం అధికారులు గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

పట్టణంలోని జయరామారావు వీధిలో నివాసం ఉంటున్న వైకాపా కార్యకర్త ఇటీవల మృతిచెందాడు. వారి కుటుంబానికి ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఫఠాన్ ఫరీద్‌ఖాన్, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట భర్త కోట.చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులతో కలసి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు, గర్భవతులకు కోట.చంద్రబాబు రొట్టెలు, పండ్లు, బిస్కట్లు పంపిణీచేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు తోటగణేష్, ప్రధాన కార్యదర్శి పేటచిరంజీవి, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి పేటచంద్రశేఖర్, నాయకులు నితీష్‌కుమార్, గణేష్, వెంకటరమణ యాదవ్, మూర్తి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్రకోణంతోనే చంద్రబాబుపై కేసు నమోదు

సత్యవేడు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

అధికారదాహంతో తమనేత చంద్రబాబుపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తప్పుడు కేసులు బనాయించి ఆనందం పొందడాన్ని తెలుగురాష్ట్రాల ప్రజలు గమనిస్తున్నారని సత్యవేడు తెదేపా ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్ వెల్లడించారు. చంద్రబాబు అరెస్ట్‌తో ఆనందంగా ఉన్నా రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలేనిరాహార దీక్షను గతకొద్ది రోజులుగా కొనసాగిస్తున్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మాజీ కేంద్రమంత్రి పకబాకలక్ష్మీ మాట్లాడుతూ నాడు చంద్రబాబు చుట్టూ పనిచేసిన ఐఏఎస్ అధికారులు నేడు జగన్మోహన్‌రెడ్డి చుట్టూ తిరుగుతూ తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, జిల్లా అధ్యక్ష్యుడు నరసింహ యాదవ్, నియోజకవర్గ మహిళా అధ్యక్ష్యురాలు వరలక్ష్మి, సుమాంజలి, యమున తదితరులు పాల్గొన్నారు.

వినాయక స్వామికి ప్రత్యేక పూజలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

పుత్తూరు మండలంలోని శిరుగురాజుపాళెం పంచాయతీలోని దిగువగూళూరు గ్రామంలో వినాయకస్వామికి ఇరిగేషన్ ఏఈఈ జె.గురుశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఇరిగేషన్ ఏఈఈ జె.గురుశేఖర్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ జె.గురుశేఖర్, గ్రామ యువకులు మురగయ్య, జగదీష్, సుబ్రహ్మణ్యం, ఉమాపతి, గ్రామప్రజలు యువకులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

చెన్నై నుంచి తిరుమలకు నడిచి వెళుతున్న గోవింద భక్తులకు రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ విరిత దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు నుంచి తిరుమలకు నడిచి వెళుతున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆయనతో పాటు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ రోడ్‌లో వినాయక చవితి వేడుకలు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

నేతాజీ రోడ్లు ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహానికి శుక్రవారం మధ్యాహ్నం నగర మేయర్ డాక్టర్ శిరీష పూజలు నిర్వహించారు. ముందుగా నేతాజీ రోడ్ స్థానికులు మేయర్ డాక్టర్ శిరీషను సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నధానం కార్యక్రమంలో పాల్గొని స్థానికులకు, యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. నేతాజీ రోడ్డు స్థానికులు, బిజేపి నాయకులు సుబ్రమణ్యం యాదవ్, ఈశ్వర్, సురేంద్ర, హేమంత్, సాయి కళ్యాణ్, యువరాజ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి 27 మంది ఎంపిక

నగరి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ 29వ బెటాలియనన సుబేధార్ బాలకృష్ణ, బహదూర్ పర్యవేక్షణలో కళాశాల ఏఎన్‌వో లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో 28 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ అభినందనలు తెలియజేశారు. సమా వేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, అందులో ఉన్న వారు జాతీయ సేవకు సిద్ధంగా ఉండే బాధ్యతాయుత పౌరులన్నారు. ఎన్‌సీసీలో ప్రవేశాన్ని విద్యార్థులు గర్వంగా భావించాలన్నారు.

నగరిలో టీడీపీ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష

నగరి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అక్రమ అరెస్టును ఖండిస్తూ బాబుతో మేము సైతం అంటూ నగరిలో నిరాహారదీక్ష కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకో ప్రభుత్వం పోవాలని సైకిల్ రావాలని నినాదాలు చేశారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను, కక్ష సాధింపు చర్యలు ఆపాలన్నారు. చంద్రబాబు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు సెక్రటరీ దాముయాదవ్, నగరి రూరల్ తెలుగు రైతు ప్రెసిడెంట్ నారాయణస్వామినాయుడు, వడమాలపేట రైతు ప్రెసిడెంట్ మునిరెడ్డి, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయలు నాయుడు, నగరి రూరల్ ప్రెసిడెంట్ శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, పట్టణ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, వడమాలపేట ప్రెసిడెంట్ జానా వెంకటయ్య, చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గోపిరెడ్డి, మధునాయుడు, ఆర్ముగం,కరుణ,ఉమాపతి,ధనంజయరాజు,గణేష్,ఏళుమలైరెడ్డి,హేమాద్రినాయుడు,పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పిచ్చాటూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

పిచ్చాటూరులోని నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నీరువాయి, వేలూరు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ స్థులకు రక్తపోటు, మధుమేహం, జ్వరం, కంటి ఇన్స్పెక్షన్, ఇతర సాధారణ వ్యాధులతో సహా వివిధ వ్యాధులను పరీక్షించారు. శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంస్థ డైరెక్టర్ ప్రేమ్ తెలిపారు. ప్రతినెల రెండు మారుమూల గ్రామాల్లో సంస్థ తరపున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ గ్రామస్థులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలు ఈ వైద్య శిబిరం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మెడికల్ టీం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెత్త రహిత భారత్ లక్ష్యంగా "స్వచ్ఛతా హి సేవా"

చంద్రగిరి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

చెత్త రహిత భారత్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చంద్రగిరి పంచా యతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి అన్నారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చంద్రగిరిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై పంచాయతీ కార్యాలయం నుండి నాగాలమ్మ సర్కిల్ వరకు సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ ప్రచారం ఈ నెల 15 నుండి అక్టోబర్ 2 వరకు డిడిడబ్ల్యుఎస్, ఎంఓయు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023 ఏడాది చెత్త రహిత భారతదేశం అనే లక్ష్యం దిశగా సాగుతుందన్నారు.ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, రాజా, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో పశు వైద్య చికిత్సలు

-వైసిపి యువనేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

అత్యాధునిక వైద్య పరికరాలతో పశు వైద్య చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని వైసిపి యువనేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయలచెరువు పేటలో ప్రభుత్వం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధులను గుర్తించడానికి అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించడానికి అత్యాధునిక అల్ట్రాసౌండ్ పరికరం ద్వారా పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రఘునాథరెడ్డి, కుప్పం బాదూరు పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పూట చోరీలకు పాల్పడే దొంగ అరెస్టు

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

రాత్రి పూల చోరీలకు పాల్పడే దొంగను అరెస్టు చేసి 90 వేల విలువ గల ద్విచక్ర వాహనం, లాప్‌టాప్, కెమెరా, హార్డ్ డిస్క్, టాబ్, స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో డిఎస్పి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ చీరి కేసులో పట్టుబడిన ముద్దాయి చిత్తూరు జిల్లా, శాంతిపురం మండలం, కర్లగట్లకు చెందిన వి. సతీష్ (26)గా గుర్తించిన్నట్లు తెలిపారు. ఎల్ఎస్ నగర్‌లో ఈ నెల 18వ తేదిన జరిగిన వరుస షాపుల్లో జరిగిన చోరీలలో నిందితుడు సతీష్‌గా గుర్తించారు. సతీష్ పై గతంలో కూడా బంగారుపాల్యెం పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసులో అరెస్టు కాబడి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

సంచార జాతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి

-ఎబిజె జాతీయ ఉపాధ్యక్షుడు సుధాకర్ చౌదరి డిమాండ్

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

రోహిణి కమిషన్ రిపోర్టును ఆధారంగా చేసుకుని ఓబిసి జాబితాలో ఉన్నటువంటి సంచార జాతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా పార్లమెంట్‌లో ఓబిసి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి న్యాయం చేయాలని అఖిల భారతీయ జనసంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లినేని సుధాకర్ చౌదరిశుక్రవారం ఓ ప్రకటనలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు.స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన సంచార జాతులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం క్రిమినల్ ట్రిబ్స్ యాక్ట్ కింద 200 సంచార జాతులను 100 ఏళ్లు తీవ్ర నేరస్తులుగా ముద్ర వేసిందన్నారు.ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధికి కృషి చేయలేదని,కనీసం ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనైనా ప్రధాని మోడీ ఓబిసి వర్గీకరణ చేసి,ఓబిసిలోని సంచార జాతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు.

తిరుపతి డివిజన్

అతిథి అధ్యాపకులు కావలెను

పుత్తూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, తమిళం సబ్జెక్ట్‌లు బోధించేందుకు అతిథి అధ్యాపకులు కావలెనని ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎంసిఎ, ఎంటెక్‌లతో పాటు యుజిసి సెట్, ఎపి సెట్, పిహెచ్‌డి అర్హతలు కలిగి వుండాలన్నారు. తమిళ అధ్యాపకులు ఎంఎ (తమిళం)తో పాటు యుజిసి సెట్, ఎపి సెట్, పిహెచ్‌డి డిగ్రీలను అర్హతగా పరిగణిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీన కాలేజీలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 8142538870 మొబైల్ నెంబరుకు సంప్రదించాలన్నారు

సకల శుభాలు కలగాలని...భక్తులకు అన్నదానం

తిరుపతి,సెప్టెంబర్ 22ప్రభాతవార్త:

విఘ్నాలకు అధిపతి వినాయకుడి అనుగ్రహంతో ప్రజలకు మంచి జరగాలని, సకల శుభాలు కలగజేయాలని వేడుకుంటూ తిరుపతిలోని కర్నాలవీధి లేఔట్‌లో శుక్రవారం నిర్వాహకులు పూజలు చేశారు. వినాయకవిగ్రహం వద్ద నిర్వాహకులు 25వడి విజన్ నాయకులు జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో బుల్లెట్‌రమణ, మహేశ్ యాదవ్, చిన్నపాపమ్మ, నాగరాజు, శ్రీను, రమేశ్, రాజు, రాజేంద్ర,కిట్టు, చిన్నోడు, దినేష్,ప్రీతం తదితరులతో కలసి ఎం.సుగుణమ్మ భక్తులకు అన్నదానం చేశారు.

గ్రామవీధుల్లో ఆరవ రోజు ఊరేగిన దేశికార్లు

నారాయణవనం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో వెలసిన దేశికార్ల ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు తిరుచ్చివాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు భక్తుల రద్దీ తగ్గనే లేదు. భక్తులకు టిటిడి అధికారులు ప్రసాదాలను అందించారు.

అగస్తీశ్వరుని ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

నారాయణవనం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవళ్లీ సమేత అగస్తీశ్వ రుని ఆలయంలో గత రెండు రోజులుగా టిటిడి అధికారులు పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రీయ క్షత్రిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

నారాయణవనం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేది ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం1గంట వరకు పుత్తూరులోని ఎంఎస్ఎం నగర్‌లోని శ్రీ వేదవ్యాస విద్యానికేతన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కాజాపీర్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అందరు పాల్గొని వైద్య పరీక్షలు ఉచితంగా పొందాలని కోరారు.

భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంత వేలూరు ప్రధాన ఉపాధ్యాయులు మాధవయ్య, సంతవేలూరు గ్రామ పంచా యతీ కార్యదర్శి హాబీబ్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు, సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత, పరిశుభ్రతకు, సంబం ధించిన నినాదాలు చేశారు.పాఠశాల ఉపాధ్యాయులు నరసింహులు, హరినాథ్ రె

ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణలు

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన చిన్న శేషవాహనసేవ, బంగారు పెద్ద శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే ఆలయంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ ఎంతో ఆకట్టుకుంది. ఈమేరకు ప్రధాన ఆలయం లోని, అన్వేటిమండపం, అలంకారమం డపం, సుపథమండపంలను వివిధ రకాల పుష్పాలు, అరటిచెట్లు, మామిడితోరణాలతో ప్రత్యేకంగా అలంకరి ంచారు. ముఖ్యంగా ఆన్వేటి మండపంలో గుమ్మడికాయలు, క్యారెట్, బీటు రూట్, కరివేపాకు, దోస తదితర కూరగాయలతో తయారుచేసిన వివిధ రకాల స్వామివారి రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీనితో ఉదయం నుండి రాత్రి వరకు ఎటు చూసినా భక్తజన సందోహంతో కాణిపాకం నిండిపోయింది. ఆలయంలోని కూలైన్లన్ని కిటకిటలాడాయి. అలాగే కాణిపాకం ఆలయ పరిసరాలన్ని భక్తజన సందోహంతో నిండిపోయింది.

కాణిపాకంలో నేడు (శనివారం)

ఉదయం : అభిషేకం మరియు చిలకవాహనం సేవ
ఉభయదారులు: కాణిపాకం ఆర్యవైశ్యులు.
రాత్రి : వృషభవాహనసేవ

ఉభయదారులు : కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరు శాలివాహన వంశస్థులు. సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు స్వామిని శ్రియానంద సరస్వతి, వి.కోట వారిచే ధార్మికోపన్యాసము, 12 గంటల నుండి 2 గంటల వరకు ఎన్.సుమతి, బాగవతారిణి,తిరుపతి వారిచే మహాభారతం హరికథ,2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జ్ఞానప్రసన్న తిరుపతి, 4 గంటల నుండి 6 గంటల వరకు పరిగమపద సంగీత అకాడమి కాకినాడ వారిచే భక్తి గీతాలు, 6 గంటల నుండి 8 గంటల వరకు ముద్ర డ్యాన్స్ స్కూల్ కడప వారిచే కూచిపూడి నృత్యాలు, 8 గంటల నుండి 9 గంటల వరకు నవ్య దీపిక తమతం, కూచిపూడి డ్యాన్సర్ హైదరాబాద్ వారిచే కూచిపూడి నృత్యాలు, 9 గంటల నుండి 10 గంటల వరకు ఎ.హరిణి వారిచే భరతనాట్యం, 10 గంటల నుండి 12 గంటల వరకు నటరాజ నాట్యమండలి వారిచే మోహిని భస్మాసుర పౌరాణిక నాటక ప్రదర్శన, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి లంబాడి నృత్యాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం

-కిక్కిరిసిన భక్తజనం

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన చిన్నశేషవాహనం, పెద్ద బంగారు శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాధుల నుండి వేలాదిగా తరలివచ్చిన కమ్మవ ంశస్థులు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. వీరు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారుల కోలాటాలు, చెక్కభజనలు, విచిత్ర వేషధారణ, పలు రకాల నృత్యాలు వంటి వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ స్థానిక మణికంఠేశ్వరాలయం నుండి సుమారు 1000 కలశాలతో గ్రామపురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకారమండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వుంచి వేదపండితుల మంత్ర ఘోష నడుమ అష్టోత్తర శత కలశాలలోని పాలతో ఘనంగా అభిషేకించారు. అలాగే పలు రకాల సుగంధ ద్రవ్యాలతోనూ అభిషేకించి చతుర్వేద పారాయణం గావించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపధీప నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా వేదపండితులు మంత్రపుష్పం గావించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బేరి వారి మండపం వద్ద అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని బేరివారి మండపం వద్ద శుక్రవారం వరసిద్ధి వినాయక భక్త బృందంచే ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో నిర్వహించారు. ఆలయన స్వామికి సారెను అందించారు.గణపతి హోమాలు నిర్వహించారు. సహపంక్తిభోజనాలు ఏర్పాటు చేసారు. స్థానిక సంప్రదాయం మేరకు భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో కమిటి సభ్యులు సాయి,కోనేటి అయ్యప్ప, వజ్రం కిషోర్, సొట్ట కుమార్, కిరణ్,మణి, రాజు, రవి, రాజా, రామిశెట్టి సాయి, అంజూరు రాజా, రెడ్డి,ఢిల్లి, బాబు,ఈగా బాబు, అంజూరు వెంకటేష్‌బాబు,మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, వేడాం కృష్ణయ్య, కొండేటి గోపాల్, ధర్మయ్య యాదవ్, కన్నా వెంకటేశ్వర్లు,మద్దు వాసు యాదవ్, పుణ్యం ఢిల్లి కుమార్, చొక్కాణి రవి చంద్ర,సుబ్రమణ్యం,సజ్జా హరిష్,భరత్, ఢిల్లి,రవి రాయల్ కుమార్, రాజనరసింహాన్, అబ్దుల్లా, సాయి తదతరులు పాల్గొన్నారు.ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. పూజల్లో పాల్గొన్నారు. ఆయనను కమిటి తరఫున కోలా ఆనంద్‌కుమార్ దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

వైసిపి మంత్రులు నోరు అదుపులో పెట్టుకోవాలి

-తెలుగు యువత కంకణాల హెచ్చరిక

తిరుపతి టౌన్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

వైకాపా ప్రభుత్వ పాలక మంత్రులు రోజా,అంబటి రాంబాబు టిడిపి నేతలను విమర్శించడం పట్ల అగ్రహించిన టిడిపి స్టేట్ స్పోక్స్ పర్సన్ కంకణాల రజనీకాంత్ తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందు ఆగ్రహం వ్యక్తం చేసారు. శుక్రవారం తెలుగు యువత నేతలు రాగుల ఆనంద్ గౌడ్, ఆర్‌పి శ్రీనివాస్, పవన్ చౌదరి, అన్నారెడ్డి వెంకట్ రెడ్డి, టి. శీను, మురళి, బుల్లెట్ శీను, నవీన్, అక్రమ్, రాఘవ తదితరులతో కలిసి రజనీకాంత్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సిఎంగా ఉన్న కాలంలో నేటి సిఎం జగన్ అవినీతి ట్రాన్సాక్షన్స్‌కు హద్దు లేదన్నారు. తమ నేత చంద్రబాబు మచ్చలేని చంద్రుడని వైకాపా అవినీతి సామ్రాజ్యంలో నారా చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టడం బాధాకరమన్నారు. దీనిని ప్రశ్నించిన తమ నందమూరి బాలకృష్ణ, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లపై మంత్రులు రోజా, అంబటిలు మాటల దాడి చేయడం పట్ల నిప్పులు చెరిగారు. నిన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో తమ బాలకృష్ణపై మాటల దాడి చేయడాన్ని ఖండించారు. హిందూపురం నియోజకవర్గంలో కరోనా సమయంలో తమ బాలకృష్ణ చేసిన సేవలను కొనియాడారు. రోజా, అంబటిలు వారి నియోజకవర్గాలుకు ఏమీ చేశారని ప్రశ్నించారు. రోజాకు డైమండ్ రాణి అని, పేరు ఎవరు పెట్టారో గానీ ఆ పేరును రోజా సార్థకత చేస్తున్నదన్నారు. అందరి సరదాలను తీర్చేస్తుందని టిడిపి పై విమర్శించిన రోజా మాట త్వరలో వైకాపాకు కచ్చితంగా తగులుతుందని జోష్యం చెప్పారు. తమ టిడిపి నేతల భవిష్యత్తు గురించి విమర్శించే. రోజ, అంబటిలు రానున్న ఎన్నికలలో పరాజయం కానున్నారని, ఎలాగో జీవనం కోసం అప్పుడు చిలక జోస్యం చెప్పుకోవడం ఖాయమన్నారు. ఎందుకంటే అవినీతి సామ్రాట్లైన వీరు జైలు జీవితం గడపనున్నారని హెచ్చరించారు.

చంద్రబాబు ఫోటోలు వీడియోలతో... చెవిరెడ్డి శునకానందం

-టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

అక్రమ అరెస్ట్‌తో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పడుతున్న ఇబ్బందులను ఫోటోలు, వీడియోలు తీయించి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శనకానందం పొందుతున్నట్లు ఎద్దేవా చేశారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద శుక్రవారం టిడిపి రైతు విభాగం ఆధ్వర్యంలో రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు సంఘీభావం ప్రకటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారం మొత్తం సిఎం జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరెస్ట్, జైలుకు తరలింపును ఫోటోలు, వీడియోలు తీయించి నీచంగా ప్రవర్తిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఈ టిడిపి రైతు విభాగం జిల్లా కార్యదర్శి కన్నయ్య నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుమల రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు గిరిధర్‌రెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, సక్కార్ ధనంజయ రెడ్డి, ఏ.జి.పల్లి బాల, గౌస్‌భాషా, కాపువీధి సునీల్,మండలంలోకేష్‌రాయల్,ప్రభాకర్ నాయుడు, అనార్కలి, మల్లికమ్మ, నాయుడమ్మ, పాల్గొన్నారు.

శృంగార శ్రీనివాసుడు

మోహినీ అలంకారంలో అభయం

తిరుమల,సెప్టెంబర్ 22 ప్రభాతవార్తప్రతినిధి:

వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శుక్రవారం ఉదయం శృంగారరసాధిదేవతగా మోహినీరూపంలో మలయప్పస్వామి భక్తులకు కటాక్షంచాడు. దంతపుపల్లకిపై చేతిలో బంగారపుచిలుకను ధరించి మరోరూపంలో పక్కనే శ్రీకృష్ణుడు అలంకృతుడై ఆలయంముందుకు విచ్చేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు కర్పూరహారతులిచ్చి పల్లకీలను భక్తుల గోవిందనామస్మరణల మధ్య ఊరేగించారు.ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బోర్డు సభ్యుడు యానాదయ్య, టిటిడి జెఇఒ సదాభార్గవి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటి ఇఒ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఒ నరసింహకిశోర్ ,జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఓటుతో వైసిపికి ప్రజలు బుద్ధిచెబుతారు

-చంద్రబాబు అక్రమ అరెస్టుపై టిడిపి నేతల మౌననిరసన

తిరుపతి,సెప్టెంబర్ 22ప్రభాతవార్త:

దేశవిదేశాలలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ప్రజలు మద్దతు పలుకుతున్నారని, అయితే రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనసాగుతోందని టిడిపి నేతలు అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ నాలుగేళ్ళ పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని, మోసం, భయంతో ప్రజలను లొంగదీసుకోవాలని చూస్తున్న జగన్‌కు అదేమీ లాభించకపోవడంతో ప్రజాదరణ తగ్గిపోయిందనే భయంతో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చడానికి వైసిపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. నిరసనదీక్షలో భాగంగా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం, జైలుకు పంపడాన్ని నిరసిస్తూ బాబుతో మేము సైతం అంటూ రిలేనిరాహీరదీక్షలు తిరుపతిలో నేతలు చేపట్టారు. ఈ దీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని మౌనదీక్ష చేశారు. త్వరలోనే ఓటుతో ప్రజలు జగన్‌కు, వైసిపికి చరమగీతం పాడి తరిమికొట్టే పరిస్థితులు వచ్చాయని అన్నారు. చంద్రబాబునాయుడును న్యాయదేవత రక్షించి త్వరలోనే విడుదల చేస్తుందని కోరారు. ఈ నిరాహారదీక్షలో టిడిపి నాయకులు ఎం.సుగుణమ్మ, నరసింహ యాదవ్, పనబాకలక్ష్మి, పుష్పావతియాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, ఆర్‌సి మునికృష్ణ, ఊకా విజయకుమార్, మునిశేఖర్‌రాయల్, వట్టికుంట చిన్నబాబు, మహేశ్‌యాదవ్, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, బుల్లెట్‌రమణ, ఎస్ఎంవి శ్రీధర్, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఆనందగౌడ్, జ్ఞానశేఖర్, హేమంత్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాదేవి గౌరీనేని జన్మదిన వేడుకలు

రేణిగుంట, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరీనేని 59వ పుట్టిన రోజు వేడుకలను, అమర ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది సమక్షంలో రమాదేవికేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట శివకృష్ణ, డా. వరుణ్, డా. రవికుమార్, శివపార్వతి, సీఏవో వేణుగోపాల్, దివ్య పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు బ్యాంకులోని నగలు తీత

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 25 నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ నేపథ్యంలో శుక్రవారం బ్యాంకు లాకర్లో భద్రపరచిన స్వామి అమ్మవార్ల ఏడు వారాల నగల్లో అలంకరణకు కొన్నింటిని బయటకు తీసారు. పవిత్రోత్సవాలు ఈ నెల 25నుంచి 30 వరకు నిర్వహించుటకు ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,కరుణాకర్ గురుకుల్స్ మూహూర్తం ఖరారు చేసినట్లు ఇఓ కెవి సాగర్‌బాబు ప్రకటించారు. బంగారు నగలను ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు, అకౌంటెంట్ యుగంధర్,సూపరింటెండెంట్ కళ్యాణి, ఆలయ ఆర్చకులు సూరి గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.ఆలయంలో శాస్త్రోక్తంగా నిర్వహించే పవిత్రోత్సవాలకు కుంకుమను కాకినాడకు చెందిన భక్తులు విరాళంగా అందిస్తారు. పవిత్రోత్సవాల అంకురార్పణకు సన్నాహాలు చేస్తున్నారు.

దివ్యఖుర్‌ఆన్ పఠనం నేర్చుకొనుటకు శిక్షణ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

అల్లాహ్‌చే పంపబడిన దివ్యఖుర్‌ఆన్ పఠనం సునాయాసమని 21 రోజుల్లో నేర్చుకొనుటకు శిక్షణ ఇవ్వబడుతుందని కలకత్తాకు చెందిన మత గురువు అతావుల్లా సాహెబ్ వివరించారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ప్రత్యేక వక్తగా వచ్చిన అతావుల్లా దివ్యఖుర్ ఆన్ గురించి వివరించారు. సాక్షాత్తు అల్లాహ్‌యే దివ్యఖుర్ ఆన్ పఠనం,అభ్యసనం ఎంతో సునాయాసమన్నారు.కానీ మన ఆలోచనలో మార్పు రావాలన్నారు. అదేదో అండపిండ బ్రహ్మాండంగా భావించి ఇది క్లిష్టం, కష్టం అనే భావనతో ఉన్నారన్నారు.ఆ ఆలోచనలో మార్పు రావాలన్నారు.మనకు నమాజు అల్లాహ్ ఆదేశించారన్నారు.దానిని ఆచరించే విధానాలను మహమ్మద్ ప్రవక్త సూచించారన్నారు. అల్లాహ్ పలు సందర్భాల్లో నమాజు ఆచరించండి మీ భృతిని నేను కల్పిస్తామని భరోసా ఇచ్చారన్నారు. అల్లాహ్ మానవుని తనను ఆరాధించుటకు పుట్టించారని మనం దానిని విస్మరించి వ్యవహరిస్తున్నామన్నారు.దివ్యఖుర్‌ఆన్‌ను చదవటం 21రోజుల్లో నేర్చుకొనుటకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఇందుకు ముస్లింలో చైతన్యం,అవగాహన కల్పించుటకు నేడు జామియా మస్‌జిద్‌లో ఏర్పాటు చేసారని వచ్చే శుక్రవారం ఓటేరు కాల్వలోని నూర్ మస్‌జిద్‌లో ఏర్పాటు చేసామన్నారు. శిక్షణను వచ్చే నెల 5న శ్రీకారం చేస్తామన్నారు. రోజులో ఒక గంట మాత్రమే శిక్షణ ఉంటుందన్నారు.నమాజుమనిసిని సన్మార్గంలో నడుపుతుందన్నారు.స్వర్గస్తుల్ని చేస్తుందన్నారు.ఏర్పాట్లను జామియా మస్‌జిద్‌ముతవల్లి అక్రం సాహెబ్ వారి సహచరులు చేసారు.స్థానిక ముఫ్తిసాహెబ్ నయిం సాహెబ్,పేష్‌ఇమాం హాఫీజే ఖుర్ అన్ రేహాన్‌లు దిశ,దెశ నిర్దేశం చేసారు.

గణనాధునికి సాంస్కృతిక నీరాజనం

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన శేషవాహనసేవ సందర్భంగా ఏర్పాటు చేసిన వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది. శుక్రవారం ఉదయం చిన్నశేవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహనసేవలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే పలు రకాల వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కళాకారుల గోవిందనామస్మరణలతో

నృత్యవిన్యాసాలతో ప్రతి ధ్వనిస్తున్న ఏడుకొండలు

తిరుమల,సెప్టెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:

భక్తులపాలిట కొంగుబంగారంగా వెలసిన తిరుమల శ్రీనివాసుడికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో రోజుకో అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షిస్తుండగా భక్తులు రోజుకో వేషధారణలతో స్వామివారిని ప్రసన్నంచేసుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, నృత్యాలు చేస్తున్నారు. ఎటుచూసినా ఏడుకొండలు కళాకారుల నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో, పలు రకాల వేషధారణలతో గోవింద నామస్మరణలతో మారుమోగుతున్నాయి. శుక్రవారం ఉదయం మోహినీఅవతారంలో వాహనం ముందు పలువురు అధికారులు, కళాకారులు భక్తితో తమతమ భక్తిని చాటుకున్నారు.

గరుడసేవ వీక్షణకు...పోటెత్తిన భక్తజనం

-ఉదయం నుండే ప్రశాంతంగా భక్తుల ప్రవేశం-మధ్యాహ్నానికి నిండిన కొండ

తిరుమల,సెప్టెంబర్ 22 ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల్లో కన్నులపండువగా జరుగుతున్న దేవదేవుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి జరిగిన గరుడవాహనసేవకు ఉదయం నుండే భక్తులు భారీగా కొండకు చేరుకున్నారు. ఉదయం మోహినీఅలంకార వీక్షణం తరువాత భక్తులసంఖ్య క్రమంగా పెరిగింది. 11గంటలనుండి మధ్యాహ్నం 2గంటలవరకు తిరుమలలో ఆలయ తూర్పుమాధవీధి, దక్షిణమాధ,పడమర,ఉత్తర మాధవీధులోకల గ్యాలరీలు పూర్తిగా నిండాయి. సాయంత్రం 4గంటలవరకు భక్తులనుగ్యాలరీల్లోకి అనుమతించారు. ఉదయం నుండే నిరంతరాయంగా భక్తులకు అల్పాహారంతో బాటు పులిహోర, సాయంత్రం సుండలు, పాలు, టీ, తదితర పంపిణీచేశారు. గరుడవాహనసేవకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు,టిటిడి పటిష్ట ఏర్పాట్లుచేసింది. క్షుణ్ణంగా తనిఖీచేసిన తరూవాత భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం నుండి తిరుమలలో అనేక ప్రాంతాలలో, మాధవీధుల్లోని గ్యాలరీలను టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి, పోలీసు అదికారులు ఎక్కడికక్కడే ఎప్పటికప్పుడు సిబ్బంది,భక్తుల సౌకర్యాలపై ఆరాతీస్తూ తనిఖీలు చేశారు.

ఎస్వీసిఈలో 'సిఎస్ఏ' బ్రాంచ్ విద్యార్థులకు అవగాహన సదస్సు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు నాలుగు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సు(ఓరియన్‌టేషన్)లో భాగంగా మూడవ రోజు శుక్రవారం 'సిఎస్ఏ' బ్రాంచ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐఐటి సిఎస్‌సి హెచ్ఓడి డా॥బి.వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కంప్యూటర్ జనరేషన్స్ గురించి వివరిస్తూ ప్రస్తుత కంప్యూటర్ ప్రపంచంలో వివిధ రకాలైన ఛాలెంజెస్ గురించి తెలియచేశారు.రోబోటిక్స్,డేటా ప్రాససింగ్, ఇండస్ట్రీ అప్లికేషన్స్ మరియు సెన్సార్స్ గురించి విపులంగా విశదీకరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీమ్ వర్క్ గురించి,ఇండస్ట్రీ ఎడ్యుకేషన్ గ్యాప్ గురించి వివరించారు.ఈ బ్రాంచ్‌లో ఉండే డేటా సైన్స్,సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్ యొక్క ప్రాధాన్యతను వివరించి చెప్పారు. విద్యార్థులు ప్రోగ్రామింగ్ మరియు లాజికల్ స్కిల్స్ నేర్చుకుని ఇండస్ట్రీ రెడీగా తయారవ్వాలని అన్నారు.ముఖ్యంగా ప్రస్తుతం 5 బిలియన్ ఉద్యోగాలు వేచి ఉన్నాయని తెలిపారు.ఎస్వీసి ఈలో ఉన్న సౌకర్యాలు,అలాగే క్లబ్స్ గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఎస్‌సిఏ హెచ్ఓడి డా॥ఆర్.స్వాతి మాట్లాడుతూ ఈ బ్రాంచ్‌ను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు, వారికి ప్రోత్సాహమిచ్చిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేశారు.